బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో గిరిజన బాలబాలికలు దరఖాస్తు చేసుకోవాలి

వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, మే 20 : బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో చదువుకునేందుకు గిరిజన బాలబాలికలు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ జిల్లాలో చదువుతున్న గిరిజన బాలబాలికలు 2024-25 విద్యా సంవత్సరానికి 3, 5, 8 తరగతుల్లో ప్రవేశాలకై దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలో 64 సీట్లలో 3వ తరగతిలో 32 మందికిగాను లంబాడా బాలురు 18, బాలికలు 11, చెంచులకు 3 ఖాళీలుండగా బాలురు 1, బాలికలు 2కు అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఐదో తరగతిలో 16 ఖాళీలుండగా.. 10 లంబాడా బాలురకు, 4 బాలికలకు, చెంచులకు 2 ఉండగా.. బాలురు, బాలికలకు ఒక్కొక్కటి చొప్పున కేటాయించినట్లు చెప్పారు. 8వ తరగతిలో 16 ఖాళీలో లంబాడా బాలురు 11, బాలికలు 4, ఒక చెంచు బాలికకు అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఒక కుటుంబం నుంచి ఒక విద్యార్థికి మాత్రమే బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో అవకాశముంటుందని పేర్కొన్నారు. తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతవాసులకు రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతవాసులకు రూ.2 లక్షలలోపు ఉండాలన్నారు. కులం, ఆదాయం, నివాసం, ఆధార్ కార్డు, పుట్టిన తేది సర్టిఫికెట్, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల బోనఫైడ్‌తో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో దరఖాస్తు సమర్పించాలన్నారు. మే 21 నుంచి జూన్ 6 వరకు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తులు పొంది, జూన్ 6వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కార్యాలయ పరిధిలో తమ దరఖాస్తులను సమర్పించాలన్నారు. జూన్ 12న లాటరీ విధానం ద్వారా విద్యార్థుల ఎంపిక ఉంటుందని, ఎంపికైన విద్యార్థుల జాబితా జూన్ 13న జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయంలో ప్రదర్శించబడుతుందని తెలిపారు. ప్రవేశానికి అవకాశం వచ్చినవారు జూన్ 14న పాఠశాలలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఏదేని సమాచార నిమిత్తం 9948663053ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

రంగారెడ్డి జిల్లాకు 89 సీట్లు

షాబాద్ : జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ పథకం ద్వారా రంగారెడ్డి జిల్లాకు 89 సీట్లు కేటాయించినట్లు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రత్న కల్యాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 89 సీట్లలో మూడో తరగతిలో 45, ఐదో తరగతిలో 22, ఎనిమిదో తరగతిలో 22 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. జిల్లాకు చెందిన గిరిజన తెగలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేది జూన్ 6 అని చెప్పారు. దరఖాస్తు ఫారాలు మే 21 నుంచి జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయం రంగారెడ్డిజిల్లా, 2వ అంతస్తు, సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం, రంగారెడ్డిజిల్లా, కొంగరకలాన్‌లో ఉచితంగా పొందవచ్చని చెప్పారు. దరఖాస్తు చేసుకునేందుకు కులం, ఆధార్‌కార్డు, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి బోనఫైడ్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో కావాలన్నారు. సంవత్సరాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలకు మించి ఉండరాదన్నారు. జూన్ 6న సాయంత్రం 5గంటల లోగా దరఖాస్తులు తీసుకుంటారని ఆమె తెలిపారు.

రెగ్యులరైజ్ చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ, మే 20 : తమను రెగ్యులరైజ్ చేసేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీ కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జేఏసీ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్ అనేక అక్రమాలకు పాల్పడి కాంట్రాక్ట్ ఉద్యోగులకు అన్యాయం చేశారని మండిపడ్డారు. గత 25 ఏళ్లకు పైగా అతి తక్కువ వేతనాలతో పనిచేస్తూ కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల విషయంలో వీసీ కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రతిఏటా రూ.1500 ఇంక్రిమెంట్ చెల్లించేవారని, గతేడాది నుంచి నిలిపివేశారని వాపోయారు. ఈపీఎఫ్ డబ్బులు కూడా ఇవ్వకుండా కోర్టుల చుట్టూ తిప్పుతూ కాలయాపన చేస్తున్నారని, దీంతో తాము ఎంతో నష్టపోతున్నామని చెప్పారు. వెంటనే ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పరీక్షల నిర్వహణకు పకడ్బందీ చర్యలు

వికారాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి శంకర్‌నాయక్

సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్

వికారాబాద్, మే 20 : ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి శంకర్‌నాయక్ తెలిపారు. సోమవారం పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షలు సజావుగా జరిగేలా అధికారులందరూ సహకరించాలన్నారు. ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సరం పరీక్షలు ఈ నెల 24 నుంచి జూన్ 3 వరకు నిర్వహిస్తారన్నారు. మొదటి సంవత్సరం పరీక్ష ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, రెండో సంవత్సరం పరీక్ష మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలు నిర్వహించేందుకు వికారాబాద్ మండలంలో 6, తాండూరు 4, పరిగి 4., నవాబుపేట, పెద్దేముల్, మర్పల్లి, మోమిన్‌పేట్, దోమ, కొడంగల్, కులకచర్ల మండలాల్లో ఒక్కో పరీక్ష కేంద్రం చొప్పున మొత్తం 20 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలను కల్పించినట్లు ఆయన తెలిపారు.

ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం జనరల్, ఒకేషనల్ కలిపి 7831 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. మొదటి సంవత్సరంలో 4621 మంది, రెండో సంవత్సరంలో 3210 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్స్, వాచ్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించకూడదని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసివేయించాలన్నారు. పరీక్షా సమయాల్లో నిరంతర విద్యుత్ సౌకర్యం ఉండాలని, అత్యవసర మందులతో పాటు ఏఎన్ఎం, సిబ్బందిని నియమించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షా సమయాలను బట్టి విద్యార్థుల సౌకర్యార్థం బస్సులను నడిపించాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సమీక్షా సమావేశంలో ఆర్టీసీ డిపో మేనేజర్ భిక్షూనాయక్, పోస్టల్ అధికారి పద్మారావు, విద్యుత్ శాఖ ఏడీ రామచంద్రయ్య, ఆర్డీవో డీఏవో గోవిందమ్మ, పోలీస్ ఇన్‌స్పెక్టర్, జూనియర్ లెక్చరర్ బుచ్చయ్య, వైద్య ఆరోగ్య శాఖ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. ఉపాధి కూలీలకు శాపం

- రోజుకు రూ.80 కూలీ మాత్రమే..
- తమకు న్యాయం చేయాలంటూ ఉపాధి కూలీల నిరసన

జాపాలలో నిరసన తెలుపుతున్న ఉపాధి హామీ కూలీలు

మంచాల, మే 20 : ఎండను సైతం లెక్కచేయకుండా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉపాధి హామీ పనులు చేసినా రోజుకు రూ.300 కూలీ పడాల్సి ఉన్నప్పటికీ రూ.80 మాత్రమే పడుతున్నాయని.. ఇదెక్కడి న్యాయమంటూ సోమవారం మంచాల మండలం జాపాల గ్రామానికి చెందిన కూలీలు జాపాల ప్రధాన చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ.. వారం రోజుల క్రితం పనిచేసిన కూలీలందరికీ రోజుకు రూ.300లకు బదులుగా రూ.80 చొప్పున తమ ఖాతాల్లో జమయ్యాయని చెప్పారు. రూ.80లతో కుటుంబాన్ని పోషించడం ఎలా సాధ్యమవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకంలో పనిచేయాలంటే గడ్డపారలు అవసరమని, వారంవారం గడ్డపారకు మొన పెట్టించుకోవాలంటే రూ.200 ఖర్చవుతుందని.. తాము చేసిన కూలీ డబ్బులు గడ్డపార మొన పెట్టుకోవడానికే సరిపోతున్నదన్నారు. కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ పరిస్థితి దాపురించిందని.. తమకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న మంచాల ఎంపీడీవో బాలశంకర్ కూలీలతో మాట్లాడి కూలీలందరికీ న్యాయం చేస్తానంటూ హామీ ఇచ్చారు.

పారాహుషార్..

- విత్తనాల కొనుగోలులో జరభద్రం
- గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలి
- విత్తనాల లక్షణాలను రైతులు పరిశీలించాలి
- కల్తీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు
- ఇబ్రహీంపట్నం వ్యవసాయ శాఖాధికారి వరప్రసాద్‌రెడ్డి

విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ఇబ్రహీంపట్నంరూరల్, మే 20 : వానకాలం సీజన్ మరికొన్ని రోజుల్లో ప్రారంభమవుతున్న నేపథ్యంలో వ్యవసాయశాఖ విత్తనాలు, ఎరువులపై ప్రత్యేక దృష్టి సారించింది. రైతుల డిమాండ్ మేరకు సాగు విస్తీర్ణం ఆధారంగా ఏయే పంట విత్తనాలు ఎంత అవసరమో గుర్తించి రైతులకు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నది. ముఖ్యంగా వ్యవసాయశాఖ, పోలీసుశాఖ ఆధ్వర్యంలో విత్తనాలు, ఎరువులపై ప్రత్యేక దృష్టి సారించారు. నాసిరకం విత్తనాల అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం నిషేధించిన విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తూ వ్యవసాయశాఖ విస్తృతంగా ప్రచారం చేస్తున్నది. ప్రభుత్వ గుర్తింపులేని విత్తనాలను విక్రయిస్తే విత్తన డీలర్ల లైసెన్సులు రద్దు చేయడంతోపాటు కఠిన చర్యలు తీసుకోనున్నారు. ముఖ్యంగా రైతన్నలు గుర్తింపు పొందిన కంపెనీలకు చెందిన విత్తనాలే వాడాలని వ్యవసాయాధికారులు, వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించి ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి అధిక దిగుబడులు సాధించాలని కోరుతున్నారు. ఫెర్టిలైజర్ దుకాణ యాజమానులు కల్తీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇబ్రహీంపట్నం వ్యవసాయశాఖాధికారి వరప్రసాద్ రెడ్డి తెలిపారు. రైతులు ఒకటికి రెండుసార్లు పరిశీలించి నాణ్యమైనవా, కల్తీయా అని పరిశీలించి విత్తనాలు కొనుగోలు చేయాలని అధికారులు తెలుపుతున్నారు. ఇప్పటికే వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో విత్తనాల కొనుగోలు విషయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు

* విత్తనాలు వంద శాతం స్వచ్ఛత కలిగి ఉండాలి.
* 98 శాతం బాహ్య స్వచ్ఛతను కలిగి ఉండాలి. హైబ్రీడ్ లేదా అధిక దిగుబడి ఇచ్చే రకాన్ని ఎంచుకోవాలి. విత్తనాల్లో తగినంత తేమ శాతం ఉండేలా చూసుకోవాలి.
* విత్తనాల్లో అంతర్గత చీడపీడలు లేని ఆరోగ్యకరమైనవి మాత్రమే ఎంచుకోవాలి.
* బిల్లుపై విక్రయదారుడి సంతకంతో పాటు విత్తన వివరాలు ఉండేలా చూసుకోవాలి.
* విత్తనం రకం, ఉత్పత్తి చేసిన సంస్థ పేరు, లాట్ నంబర్ ఉండేలా బిల్లు తీసుకోవాలి.
* ఏ విత్తనం అయినా కొనుగోలు చేసేటప్పుడు గుర్తింపు పొందిన సంస్థల నుంచి తీసుకోవాలి.

ఇలాంటి విత్తనాలు కొనవద్దు

* ఆకుపచ్చ లేబుల్ లేని విత్తనాలు కొనుగోలు చేయవద్దు.
* గడువు తేదీని పరిశీలించి గడువు దగ్గరగా ఉన్న విత్తనాలు కొనుగోలు చేయాలి.
* సీల్ సరిగాలేని, చిరిగిన లేదా పాడైనా సంచులు, డబ్బాలు ఉన్నవి, లైసెన్స్‌లేని అపరిచిత వ్యక్తుల నుంచి ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలు కొనుగోలు చేయరాదు.

నోటిఫైడ్, నాన్ నోటిఫైడ్ విత్తనాల్లో తేడా..

విత్తనాల్లో ప్రభుత్వ పరంగా విడుదలయ్యేవి. ప్రైవేటు పరంగా విడుదలయ్యేవి ఉంటాయి. ప్రభుత్వ పరంగా రూపొందించిన రకాలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల నోటిఫైడ్ పేరిట మార్కెట్‌లోకి వస్తాయి. ప్రైవేటు సంస్థలు రూపొందించిన విత్తనాలు నాన్ నోటిఫైడ్ పేరిట మార్కెట్‌లోకి విడుదల చేస్తాయి. నోటిఫైడ్ విత్తనాల నాణ్యత, పంపిణీ ప్రమాణాలు 1966 నాటి విత్తన చట్టం పరిధిలోకి వస్తాయి. నోటిఫైడ్ విత్తనాలు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేనట్లయితే ఉత్పత్తిదారులు, పంపిణీదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవచ్చు.

సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలి

విత్తనాలు కొనుగోలు చేసే ముందు రైతులు సమీపంలోని వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తప్పనిసరిగా పాటించాలి. అవి మేలురకమైనవా, నాసిరకమైనవా అనేది చూసుకోవాలి. నాసిరకం విత్తనాలను వ్యాపారులు రైతులకు అంటగడితే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలి. ఎక్కడైనా కల్తీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేకుండా దుకాణాల్లో విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు.

- వరప్రసాద్‌రెడ్డి, వ్యవసాయాధికారి

విత్తన సంచులపై ఉండే వివరాలు

* పరీక్ష చేసిన తేదీ నుంచి 9 నెలల కాల పరిమితి కలిగిన విత్తనాలు కొనుగోలు చేయవద్దు.
* ఆకుపచ్చ, నీలం రంగు ట్యాగ్ ఉంటే విత్తనం ధ్రువీకృతమైనది.
* ఆకుపచ్చ, తెల్లని రంగు ట్యాగ్ ఉంటే ధ్రువీకరణ చేసే అధికారి సంతకం చేసి ఉండాలి.
* కనీసం మొలక శాతం, జన్యు స్వచ్ఛత, గరిష్ఠ తేమ శాతం, ఏ ప్రాంతానికి ఏ కాలానికి అనువైందో చూసుకోవాలి. బీటీ పత్తి విత్తనమైతే కనీస బీటీ ప్రొటీన్‌శాతం, జీఏఈఎస్ ఆమోదం పొందిన నంబర్ ఉండాలి.

సిటీలో చుడీదార్ గ్యాంగ్ హల్‌చల్

మహిళల వేషధారణలో దొంగతనాలు.. మహిళలా..? పురుషులా..?
సిటీలో సర్వత్రా చర్చనీయాంశంగా ఎస్ఆర్‌నగర్ చోరీ ఘటన

సిటీబ్యూరో, మే 20 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో గతంలో చెడ్డీ గ్యాంగ్ హల్‌చల్ చేసింది. నేడు చుడీదార్‌తో కూడిన బుర్కా గ్యాంగ్ హల్‌చల్ చేస్తోంది.. ఆడవారి వేషంలో అపార్ట్‌మెంట్లలోకి చొరబడి.. తాళం వేసి ఉన్న ఇండ్లను లూటీ చేస్తున్నారు. ఈ కొత్త తరహా మోసం హైదరాబాద్‌లోని ఎస్ఆర్‌నగర్ ఠాణా పరిధిలో ఉన్న జెక్ కాలనీలో ఆదివారం జరిగిన విషయం తెలిసిందే. జెక్ కాలనీలోని ఆకృతి ఆర్కేడ్‌లో ఉన్న 502 ఫ్లాట్ తాళాలు పగులగొట్టిన చుడీదార్ గ్యాంగ్ ఆ ఇంట్లో నుంచి నగదు, నగలు అపహరించుకుపోయింది. నగరంలో తిరిగి రోజురోజుకూ దొంగతనాలు, స్నాచింగ్‌లు పెరిగిపోతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో స్నాచింగ్, దొంగతనాలను పూర్తిస్థాయిలో కట్టడి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నేరాల కట్టడికి చర్యలు తీసుకోవడంలేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల దొంగతనాలు, స్నాచింగ్‌లు పెరగడమే ఇందుకు నిదర్శనం.

ఎస్ఆర్‌నగర్‌లోని అపార్ట్‌మెంట్‌లో చుడీదార్ ధరించి ఒకరు బుర్కా, మరొకరు ముఖానికి స్కార్ఫ్ కట్టుకొని చొరబడ్డారు. దొంగలు అపార్ట్‌మెంటులో తిరిగిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. అయితే, మగవాళ్లే ఆడవారి దుస్తులు వేసుకొని వచ్చి ఉంటారా..? ఆడవాళ్లే వచ్చారా..? అనే అంశంపై పోలీసులు సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలిస్తున్నారు. మగవాళ్లే ఆడవాళ్ల దుస్తుల్లో వచ్చి దొంగతనాలు చేసేందుకు ఎక్కువ అవకాశం ఉన్నదని ఎస్ఆర్‌నగర్ పోలీసులు చెబుతున్నారు. ఎస్ఆర్‌నగర్‌లో చుడీదార్ గ్యాంగ్ చోరీకి పాల్పడిన ఘటనను ఇప్పుడు నగర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఆడవాళ్ల వేషధారణతో దొంగతనాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. మహిళల దుస్తులు ధరించడం వల్ల దొంగతనం చేయడం ఈజీ అవుతుందని, అపార్ట్‌మెంటులోకి కూడా ఈజీగా ప్రవేశించేందుకు అవకాశం ఉంటుందని, ఎవరికీ అనుమానం రాకుండా కొత్త తరహాలో దొంగతనాలు చేస్తున్నారని, ఈ గ్యాంగును గుర్తించి పట్టుకునేందుకు నిఘా పెట్టామని పోలీసులు చెబుతున్నారు.

నిరసన తెలుపుతున్న కాంట్రాక్టర్లు

'వీ వాంట్ పేమెంట్స్'..

కొనసాగుతున్న కాంట్రాక్టర్ల పోరుబాట
పెండింగ్ బిల్లులు రూ.1350 కోట్లు

₹ మే నెలకు సంబంధించి.. రూ. 57 కోట్లు విడుదల

మొత్తం చెల్లించే వరకు పనులు చేపట్టం.. కాంట్రాక్టర్ల స్పష్టీకరణ

సిటీబ్యూరో, మే 20, (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలో కాంట్రాక్టర్ల పోరుబాట కొనసాగుతున్నది. రూ.1350 కోట్ల మేర పెండింగ్ బకాయిలు చెల్లించే వరకు జీహెచ్ఎంసీకి సంబంధించిన మెయింటెనెన్స్ పనులు చేపట్టబోమంటూ.. ఈ నెల 18 నుంచి కాంట్రాక్టర్లంతా సమ్మెలోకి వెళ్లి నిరసన తెలుపుతున్నారు. తొలిరోజు బల్దియా ప్రధాన కార్యాలయంలోని కాంట్రాక్టర్ల అసోసియేషన్ కార్యాలయం ముందు నిరసన చేపట్టగా...సోమవారం ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో కాంట్రాక్టర్లు భారీ ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. 'వీ వాంట్ పేమెంట్స్' అంటూ నినాదాలతో హోరెత్తించారు. చేసిన పనులకు బిల్లులు రాక ఆర్థిక సుడిగుండంలో చిక్కుకుని బతకలేని పరిస్థితిలో ఉన్నామంటూ.. కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లల చదువులకు డబ్బులు లేక, వర్కర్లకు ఈపీఎఫ్, బ్యాంకులకు ఈఎంఐలు కట్టలేకపోతున్నామని, ఆర్థిక బాధలతో సడెన్ స్ట్రోక్‌లకు గురై ప్రాణాలు పోతున్న పరిస్థితులు వచ్చాయని అసోసియేషన్ ప్రెసిడెంట్ రామకృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

రూ. 57 కోట్లు విడుదల

మూడు రోజులుగా కాంట్రాక్టర్లు రోడ్లు, డ్రైనేజీలు, నాలాలు, కరెంట్ పోల్స్, పార్కులు, ప్లే గ్రౌండ్, శ్మశానవాటికల అభివృద్ధి పనులు, సీసీ రోడ్లు, డ్రైనేజీ ఇలా మెయింటెనెన్స్ పనులు నిలిపివేసి బంద్‌లోకి వెళ్లారు. అసలే వర్షాకాలం.. అపై కాంట్రాక్టర్లు బంద్‌లోకి వెళ్లడంతో అధికారులు ఆలస్యంగానైనా ఆలర్ట్ అయ్యారు. ఈ మేరకు కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులతో ఫైనాన్స్ విభాగం అధికారులు చర్చలు జరిపారు. మే నెలకు సంబంధించిన రూ.57 కోట్ల నిధులను మంజూరు చేశారు. దీనిపై కాంట్రాక్టర్లు మాత్రం పెదవి విరుస్తున్నారు. పెండింగ్ బిల్లులు భారీగా ఉంటే నామమాత్రంగా డబ్బులు కేటాయించి పనుల్లోకి రావాలని అనడం ఎంత వరకు సమంజసమని, బకాయిలు మొత్తం విడుదల చేసే వరకు పనులు చేపట్టబోమని, నిరసనను కొనసాగిస్తామని ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి హెచ్చరించారు.

అత్యవసర పనుల్లోకి రాకుంటే చర్యలు

మాన్‌సూన్ ముందస్తు చర్యల్లో భాగంగా అత్యవసర పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దని, పనుల్లో జాప్యం చేస్తే సంబంధిత ఐఆర్టీ కాంట్రాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సోమవారం బల్దియా మెమో జారీ చేసింది. టెండర్ నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని, ముందస్తు ఒప్పందం మేరకు బిల్లుల చెల్లింపులు జీహెచ్ఎంసీ సకాలంలో జరుపుతుందని, అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించింది. కాంట్రాక్టర్లు మాత్రం బకాయిలు చెల్లించకుంటే అవసరమైతే ఐఆర్టీ పనులను కూడా నిలిపివేస్తామని ప్రకటించారు. మొత్తంగా వర్షాకాలం ప్రారంభ ముంగిట బల్దియా పాలన అస్తవ్యస్తంగా మారింది. భారీ వర్షాలకు వరద ముంపు నివారణ చర్యలను ఏ విధంగా అధిగమిస్తారోరన్న ఆందోళన ప్రజల్లో నెలకొన్నది.

రెండు గంటల్లో మీ ఫోన్ బ్లాక్ అవుతుంది

- తెలుసుకోవాలంటే 9 నొక్కండి
- మనీ లాండరింగ్ కేసు నమోదయ్యింది
- సెటిల్ చేసుకో.. లేదంటే అరెస్టు అంటూ??
- నయా పంథాలో సైబర్ దోపిడీ

సిటీబ్యూరో, మే 20(నమస్తే తెలంగాణ): మీ ఫోన్ రెండు గంటల్లో బ్లాక్ అవుతుంది.. కస్టమర్ కేర్‌కు మీరు కనెక్ట్ అయి సమస్య తెలుసుకోవాలంటే 9 నంబర్ నొక్కండి.. అంటూ ఫోన్లు వస్తున్నాయి. 9 నంబర్ నొక్కగానే.. ఒక టోల్‌ఫ్రీ నంబర్‌కు కనెక్ట్ అవుతుంది.. మీ ఫోన్ నంబర్‌తో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి.. ఉత్తరప్రదేశ్ లక్నోలో మీపై కేసు నమోదయ్యిందంటూ చెబుతారు.. ఈ సమాచారం నిజమని నమ్మిన కొందరు భయపడుతున్నారు. మరికొందరు అనుమానం వచ్చి ఫేక్ అనుకుంటున్నారు. ఫెడెక్స్ కొరియర్‌లో డ్రగ్స్ సరఫరా అవుతుంటే మీ ఫోన్ నంబర్, ఆధార్ నంబర్ దొరికింది.. మీపై మనీ లాండరింగ్ కేసు నమోదయ్యిందంటూ లక్షలు, కోట్ల రూపాయలు దోచేస్తున్న సైబర్‌నేరాళ్లు.. అదే మోసాన్ని కొత్త తరహాలో మొదలుపెట్టారు. సైబర్‌నేరగాళ్ల ప్రతి రోజూ వందల సంఖ్యలో కాల్స్ చేస్తూ మోసం చేసేందుకు స్కెచ్ వేస్తున్నారు. ఫోన్ లిఫ్ట్ చేయకపోతే వాట్సాప్‌కు యూపీ, ఢిల్లీకి చెందిన పోలీసు అధికారి ఫొటోను డీపీ పెట్టి.. ఫోన్ నంబర్‌ను పంపిస్తున్నారు. అలాగే, ఈ లింక్‌ను క్లిక్ చేయండి.. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి.. ఈ వివరాలు చూసుకోండి.. అంటూ ఏపీకే ఫైల్స్‌ను పంపిస్తున్నారు.

నమ్మితే... నట్టేట ముంచేస్తారు..!

పోలీసులు ఫోన్ చేశారు.. మనం మాట్లాడకపోతే ఇబ్బంది పెడుతారనే భయంతో కొందరు నిజమని నమ్మేస్తున్నారు. మీ ఫోన్ నంబర్ బ్లాక్ అవుతుందనే మెసేజ్‌లను సర్వీస్ ప్రొవైడర్లు పంపరు. అలా ఒకవేళ అనుమానం ఉంటే, మీ సిమ్ కార్డుకు సంబంధించిన నెట్‌వర్క్ ప్రొవైడర్ కాల్ సెంటర్‌కు ఫోన్‌చేసి నివృత్తి చేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. గుర్తుతెలియని ఫోన్ నంబర్ల నుంచి వాట్సాప్‌కు వచ్చే మెసేజ్‌లు, వాట్సాప్ కాల్స్‌కు స్పందించ వద్దని పోలీసులు చెబుతున్నారు.



బ్యాంకు ఖాతాల వివరాలతో..

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటంతో మీ ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేశామని, మీపై మనీ లాండరింగ్ కేసు నమోదయ్యిందని భయపెడుతూ బాధితుడికి సైబర్‌నేరగాళ్లు ఫోన్ చేశారు. లక్నోలోని అలామ్‌బాగ్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. మీ ఫోన్ నంబర్, ఆధార్ కార్డుతో ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐలో బ్యాంకు ఖాతాలు తెరిచారు. అందులో మనీ లాండరింగ్ జరిగింది.. మీపై ఫెమ, ఎఫ్ఎంఎల్ఏ యాక్ట్ కింద కేసులు నమోదయ్యాయని, వెంటనే రూ.3.05 లక్షలు డిపాజిట్ చేయాలని, లేదంటే అరెస్టు చేస్తామంటూ బెదిరించారు. దీనిపై అనుమానం వచ్చి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీసీఎస్‌లో కేసు నమోదైంది. ఇలాగే, రెండు రోజుల కిందట ఓ వ్యక్తికి వచ్చిన బెదిరింపు కాల్‌తో రూ.4 లక్షలు మోసపోయాడు. ఇటీవల ఈ కేసులు పెరుగుతున్నాయని, గుర్తుతెలియని వ్యక్తులు చేసే ఫోన్లకు భయపడవద్దని, అనుమానం ఉంటే వెంటనే తెలుపాలంటూ పో